క్లుప్తంగా

ముదిరాజ్ కులస్తులను బీసీ-ఏలోకి మార్చాలి



డొంకేశ్వర్(ఆర్మూర్): సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి బీసీ–ఏలోకి మార్చాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ నాయకులు కోరారు. ఈమేరకు వారు సోమవారం డొంకేశ్వర్ తహశీల్దార్ వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. ముదిరాజ్‌ల అభివృద్ధి కోసం సొసైటీకి వెయ్యి కోట్లు నిధులు కేటాయించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు శివకుమార్, శ్రీనివాస్, రాజేశ్వర్, దశరథ్, రాజేందర్ ఉన్నారు.

రాజారెడ్డి సేవలు మరువలేనివి



పెర్కిట్(ఆర్మూర్): అంకాపూర్ లాలన వృద్ధాశ్రమం వ్యవస్థాపకుడు, పారిశ్రామికవేత్త గడ్డం రాజారెడ్డి సేవలు మరవలేనివని బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. రాజారెడ్డి ఇటీవల మృతిచెందగా సోమవారం బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. రాజారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉర్దూ అకాడమీ రాష్ట్ర చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, పొద్దుటూరి వినయ్‌రెడ్డి, మార చంద్రమోహన్, సాయరెడ్డి, శ్రీనివాస్, జీవన్, మారుతిరెడ్డి పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



నందిపేట్(ఆర్మూర్): మండలంలోని ఐలాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా అగ్నిప్రమాదాలు సంభవించినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులు సూచించారు. సిబ్బంది మధుకర్, సురేష్, ప్రిన్సిపల్ చిన్నయ్య, పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై..



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని రాజారాం నగర్ కాలనీలో సోమవారం వైద్యశాఖ అధికారులు ఇంటింటికీ తిరుగుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేష్ మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తుండటంతో ప్రజలు తమ పరిసరాల్లో, ట్యాంకులలో నీటి నిలువలు ఉండకుండా తొలగించాలని అన్నారు. అలాగే జ్వర సర్వేను నిర్వహిస్తున్నామన్నారు. సబ్ యూనిట్ అధికారి సాయి, హెల్త్ అసిస్టెంట్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పొదుపు అలవాటు చేయాలి

మాక్లూర్: విద్యార్థులకు చిన్నతనం నుంచే పొదుపు చేయటం అలవాటు చేయాలని తపాలశాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ సురేఖ ఉపాధ్యాయులకు తెలిపారు. మండలంలోని కల్లెడి గ్రామంలోని అవార్డు పార్కు ఉన్నత పాఠశాలలో సోమవారం నిజామాబాద్ తపాలశాఖ ఆధ్వర్యంలో పొదుపుఖాతాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తపాలశాఖలో చిన్న మొత్తం పాలసీల వివరాలను వివరించారు. బీపీఎం అరుణ్, కార్యదర్శి ప్రవీణ్, గంగోల్ల ప్రశయ్‌తేజ్, మనీష్‌గౌడ్, నీలగిరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

బంద్ విజయవంతం

వర్ని: మోస్రా మండల కేంద్రంలో సోమవారం బంద్ విజయవంతమైంది. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా హిందూ సంఘాలు మోస్రా బంద్‌కు పిలుపునివ్వగా, విజయవంతమైంది. ఉదయం నుంచి వ్యాపార, వాణిజ్య, పెట్రోల్ బంకులు, దుకాణాలు, ప్రైవేట్ పాఠశాలలు మూసి ఉంచారు. బబొజ్జ సుదర్శన్‌గౌడ్, సాయిలు, అభిలాష్‌గౌడ్, శ్రీకాంత్, తరుణ్, రాజారెడ్డి పాల్గొన్నారు.

మెండోరాలో కొవ్వొత్తుల ర్యాలీ



బాల్కొండ: మెండోరా మండల కేంద్రంలో సోమవారం రాత్రి బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ర్యాలీ చేపట్టామన్నారు. బంగ్లాలో హిందువులను కాపాడాలన్నారు. నాయకులు కండెల సాయి, చారి, రమేశ్, విష్ణు, రాజారెడ్డి, గంగారెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

కేజీబీవీ భవనం ప్రారంభమెప్పుడో?

- మెండోరా మండల కేంద్రంలో 2021లో పనులు ప్రారంభం
- ఇప్పటికీ పూర్తికాని పనులు
- ఇబ్బందుల్లో విద్యార్థులు



మెండోరాలోని కేజీబీవీ నూతన భవనం



కొనసాగుతున్న పనులు

బాల్కొండ: మెండోరా మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం నూతన భవనం పనులు ఏళ్లుగా కొనసాగుతున్నాయి. దీంతో కొత్త భవనం ఎప్పుడు ప్రారంభవుతుందోనని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం భవన నిర్మాణ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. కానీ అధికారుల నిర్లక్ష్యం మూలంగా నూతన భవనం అప్పగింతలు కావడం లేదు. దీంతో అద్దె భవనంలో విద్యాలయం కొనసాగడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అద్దె భవనంలో ఇక్కట్లు..

ప్రస్తుతం కేజీబీవీ బుస్సాపూర్‌లోని అద్దె భవనంలో కొనసాగుతుంది. కానీ చినుకు పడితే భవనం ఊరుస్తుంది. దీంతో విద్యార్థులు చదువుకోవడానికి జంకుతున్నారు. గత నెలలో వారం రోజుల పాటు నిరంతరం కురిసిన వర్షాలతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. డేరాలు కట్టి తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో కొందరు విద్యార్థులు పాఠశాలను వదిలివెళ్తున్నారు. నూతన భవనంలో కింది అంతస్తు పూర్తి కావడంతో కనీసం అదైనా అప్పగిస్తే కొన్నాళ్ల పాటు సర్దుకుని విద్యార్థులు చదువుకునే అవకాశం ఉంది. కానీ అధికారులు అటువైపుగా కృషి చేయడం లేదు. ఇప్పటికైనా పాలకులు, ఉన్నత అధికారులు స్పందించి నూతన భవనం పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకొని, భవనాన్ని ప్రారంభించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

రూ.3కోట్లతో నిర్మాణం..

నూతన మండలాల ఏర్పాటులో భాగంగా మెండోరా మండల కేంద్రంగా ఏర్పాడింది. అనంతరం మండలానికి కేజీబీవీ పాఠశాలను కేటాయించారు. కొన్నాళ్లు మండల కేంద్రంలో కేజీబీవీ పాఠశాలను నిర్వహించారు. అద్దె భవనం లేకపోవడంతో కేజీబీవీ పాఠశాలను మండలంలోని బుస్సాపూర్ గ్రామానికి తరలించారు. గత మూడేళ్లుగా అక్కడే పాఠశాలను నిర్వహిస్తున్నారు. 2021లో మండల కేంద్రంలో పాఠశాల నూతన భవనం కోసం ప్రభుత్వం రూ.3కోట్ల నిధులను మంజూరు చేసింది. అదే సంవత్సరం పనులను ప్రారంభించింది. అప్పటి నుంచి ఆగుతూ.. సాగుతూ పనులు కొనసాగాయి. ప్రస్తుతం కింది అంతస్తులో పనులు అన్ని కూడ పూర్తయ్యాయి. పైఅంతస్తులో ఫ్లోరింగ్ టైల్స్ వేయడం పనులు సాగుతున్నాయి. ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి సిద్ధమవుతుందని విద్యార్థులు ఆశించారు. కానీ ఇప్పటికీ భవనం ప్రారంభానికి నోచుకోవడం లేదు.

15లోపు అప్పగిస్తామన్నారు

మెండోరాలో పాఠశాల కోసం నిర్మించిన నూతన భవనంను ఆగష్టు 15 వరకు అప్పగిస్తామని నిర్వాహకులు తెలిపారు. భవనంలో ప్రస్తుతం టైల్స్ వేసే పనులు సాగుతున్నాయి. కింది అంతస్తులో పనులు పూర్తవ్వడంతో కనీసం ఆ గదులను అప్పగించిన విద్యార్థులకు ఇబ్బంది ఉండదు. అద్దె భవనంతో ఇబ్బందులు పడుతున్నాం. సమస్యను ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్లాం.

– పద్మ, ప్రత్యేకాధికారిణి, కేజీబీవీ, మెండోరా

పారిశుధ్య సమస్య తలెత్తకుండా చూడాలి

- వ్యాపారులు, ప్రజలు సకాలంలో ఆస్తి పన్నులు చెల్లించాలి
- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



బోధన్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలో పారిశుధ్య సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పట్టణంలోని పలు ప్రాంతాలను, రోడ్లను సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయాన్ని పరిశీలించారు. మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా దోమల నివారణ చర్యలు చేపట్టాలని బల్దియా అధికారులను ఆదేశించారు. డ్రెయినేజీల నిర్మాణం చేపట్టాలని, గుంతల రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని అన్నారు. కుక్కల బెడదకు ప్రభుత్వ పరంగా తీసుకోవాల్సిన చర్యలు తప్పకుండా తీసుకుంటామని వెల్లడించారు. పట్టణ ప్రజలు, వ్యాపారులు సకాలంలో ఆస్తిపన్ను చెల్లించాలన్నారు. బల్దియా అధికారులు సైతం పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. మున్సిపల్‌కు త్వరలో నూతన భవన నిర్మాణానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు, యువకులు టెక్నికల్ విద్యను అభ్యసించేందుకు డిమాండ్ ఉన్న నూతన కోర్సులు తీసుకువచ్చేలా కృషి చేస్తామని, నవీపేట్‌లో గతంలో ఐటీఐని ఏర్పాటు చేశామని, ఆసక్తిగల విద్యార్థులు తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆర్డీవో అంబదాస రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, కౌన్సిలర్‌లు తూము శరత్‌రెడ్డి, శ్రీకాంత్‌గౌడ్, దూప్‌సింగ్, బల్దియా అధికారులు, డీసీసీ డెలిగెట్ గంగాశంకర్, పాషా మోయినొద్దిన్ ఉన్నారు.

యువత దేశభక్తిని పెంపొందించుకోవాలి



నందిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



నవీపేటలో..

నందిపేట్ (ఆర్మూర్): యువత, విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోష్ అన్నారు. నందిపేటలో సోమవారం బీజేవైఎం ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా జాతీయ గీతం, వందేమాతరం, స్వాతంత్ర్యసమరయోధులను స్మరించుకుంటూ ర్యాలీ నిర్వహించారు. సంతోష్ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ కులాలకు, మతాలకు, ప్రాంతాలకు అతీతంగా ఐక్యంగా ఉంటూ దేశభక్తిని చాటాల్సిందిగా పేర్కొన్నారు. ఆగస్టు 14న ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని సూచించారు. నాయకులు నాగ సురేష్, బాలు, సాయినాథ్, అనిల్, త్రివేద్, వికాస్, రవి, హరీష్‌గౌడ్, రాఘవేంద్ర, భూమేష్ పాల్గొన్నారు .

నవీపేట: మండల కేంద్రంలో బీజేవైఎం ఆధ్వర్యంలో సోమవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో డీజే సౌండ్‌తో దేశభక్తి గీతాలకు యువత నృత్యాలు చేశారు. నాయకులు మోహన్ రెడ్డి, ద్యాగ సరిన్, పిల్లి శ్రీకాంత్, శ్రీనివాస్‌గౌడ్, మైసరాధ, ఆనంద్, రాజేందర్‌గౌడ్, రాము, బండారి రాజశేఖర్, గణేష్ ఉన్నారు.

'సమగ్ర శిక్షా' ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



బోధన్‌లో నివాళులు అర్పిస్తున్న ఉద్యోగులు



కమ్మర్‌పల్లిలో..



నందిపేటలో..

నందిపేట్(ఆర్మూర్)/మోర్తాడ్/కమ్మర్‌పల్లి/బోధన్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తమను క్రమబద్ధీకరించాలని సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో సోమవారం మృతిచెందిన ఉద్యోగులకు సంఘ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పలువురు సిబ్బంది పని ఒత్తిడి వల్ల గుండెపోటుతో మృతిచెందగా, కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. ఇలా ఇప్పటివరకు సుమారు వందల మంది ఉద్యోగులు మృతి చెందినట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలన్నారు. బేసిక్ పేస్కేల్ వేతనం, రూ.5లక్షల ఆరోగ్య బీమా, రూ.10లక్షల జీవిత బీమా రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.10లక్షలు అందించాలని కోరారు. తమ సమస్యలపై ప్రభుత్వం దృష్టిసారించకపోతే భవిష్యత్‌లో రాష్ట్ర వ్యాప్తంగా దశల వారిగా నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, యూసుఫ్ అలీ, బాబు, నాగేష్, మానస, అరవింద్, లత, నగేష్‌గౌడ్ సురేష్, విద్యాసాగర్, రమేష్, శ్రీనివాస్, హేమంత్, ప్రవీణ్, గంగామణి తదితరులు ఉన్నారు.

క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

కమ్మర్‌పల్లి: జక్రాన్‌పల్లి మండలం అర్గుల్‌లో కుంట రాజేష్ అనే రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటనలో ఫైనాన్స్ యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా మాస్‌లైన్ జిల్లా నాయకుడు సారా సురేష్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజేష్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

సంక్షిప్తం

విద్యార్థులకు టై, బెల్టుల వితరణ



పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం గ్రామ మాజీ ప్రజా ప్రతినిధులు టై, బెల్టులను వితరణ చేశారు. దాతలు మాజీ సర్పంచ్ కల్లెం మోహన్ రెడ్డి, దుమ్మాజి శ్రీనివాస్, సీడ్ మోహన్, కబడ్డీ క్రీడాకారుడు ముత్యం, హెచ్‌ఎం నరేందర్ పాల్గొన్నారు.

బోధన్ పట్టణంలో..

బోధన్: పట్టణంలోని మధుమలాంఛ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం మున్సిపల్ ఉద్యోగి రవి ఆర్థిక సహకారంతో నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు, బిస్కెట్స్ పంపిణీ చేశారు. సెయింట్ థామస్ డీఎడ్ కళాశాల ప్రిన్సిపల్ అశోక్ కుమార్ రోడే, హెచ్‌ఎం అర్చన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెల్మల్‌కు బస్సు సౌకర్యం



నందిపేట్(ఆర్మూర్): మండలంలోని వెల్మల్ గ్రామానికి ఆర్టీసీ అధికారులు బస్సు సౌకర్యాం కల్పించారు. ఆర్మూర్ నుంచి వయా వెల్మల్ మీదుగా నందిపేటకు అదనంగా మూడు ట్రిప్పులు బస్సు ఏర్పాటు చేయడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం బస్సుకు ప్రజలు స్వాగతం పలుకుతూ పూజలు చేశారు. వీడీసీ ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

ఎంపీడీవో బదిలీ

మాక్లూర్: మండల ఎంపీడీవో క్రాంతి జక్రాన్‌పల్లికీ బదిలీ అయ్యారు. వారి స్థానంలో జక్రాన్‌పల్లి ఎంపీడీవో సతీష్ మాక్లూర్‌కు రానున్నట్టు తెలిసింది.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత

రుద్రూర్: మండలంలోని సులేమాన్‌నగర్‌కు చెందిన సీతాబాయ్ తన ఫోన్‌ను 20 రోజుల క్రితం పోగొట్టుకుంది. పోలీసులకు ఫిర్యాదు చేయగా, సోమవారం వారు ఫోన్‌ను కనిపెట్టి బాధితురాలికి అందజేశారు.

పాఠశాలకు సౌండ్ బాక్స్‌లు..

నవీపేట: మండలంలోని నాళేశ్వర్ ప్రాథమిక పాఠశాలకు రూ. 30వేలు విలువ చేసే సౌండ్‌బాక్స్‌లను జగిత్యాల జిల్లా కొండగట్టు ఆలయ పూజారి జయకృష్ణ సోమవారం వితరణ చేశారు. దాతను వీడీసీ ఆధ్వర్యంలో సన్మానించారు.

ఆర్మూర్‌లో క్రికెట్ పోటీలు

ఆర్మూర్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో సోమవారం అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలను నిర్వహించారు. పోటీల్లో యంగ్ స్టార్ క్లబ్ క్రీడాకారులు విజేతలుగా నిలవగా శ్రీరాం నగర్ క్రీడాకారులు రన్నర్‌గా నిలిచారు. క్లబ్ ప్రతినిధులు చెరుకు పృథ్వీరాజ్, గంగారెడ్డి, తిరుపతి, శశిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవీపేట్‌లో యువశక్తిపై అవగాహన సదస్సు

నవీపేట: మండలకేంద్రంలోని సాంఘీక సంక్షేమ పాఠశాలలో సోమవారం లయన్స్ సహారా ఆధ్వర్యంలో అంతర్జాతీయ యువశక్తి దినోత్సవం పురస్కరించుకొని యువశక్తిపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు జ్యూస్ ప్యాకెట్లు అందజేశారు. ప్రవీణ్‌కుమార్, ఉదయసూర్యభగవాన్, ధనుంజయరెడ్డి పాల్గొన్నారు.

ఇష్టపడి చదవాలి

వర్ని: విద్యార్థులు విద్యను ఇష్టపడి చదవాలని కష్టపడి కాదని రుద్రూర్ సీఐ జెఎస్ రెడ్డి వెల్లడించారు. మోస్రా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్ని ఎస్‌ఐ కష్ణకుమార్, ఇన్‌చార్జి హెచ్‌ఎం బాలాజీరావు, అనిల్, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం

వర్ని: మోస్రాలో సోమవారం ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఎమ్మార్పీఎస్ నాయకుడు మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. తుడుం గంగారాం ఉన్నారు.

కోటగిరి ఎంపీడీవోగా చందర్

రుద్రూర్: కోటగిరి ఎంపీవో చందర్ సోమవారం ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఎంపీడీవోగా పనిచేసిన మనోహర్‌రెడ్డి ఆయనకు బాధ్యతలు అప్పగించారు.

పలు గ్రామాల్లో వైద్య శిబిరాలు

బాల్కొండ/నందిపేట్/మాక్లూర్: బాల్కొండ మండల కేంద్రంలోని పోచమ్మ గల్లిలో సోమవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు నిర్వహించారు. అలాగే నందిపేట పీహెచ్‌సీ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ కాలనీ, ఆంధ్ర నగర్, కోల్పూర్, మాక్లూర్ మండలంలోని అమ్రాద్ తండాలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులను అందజేశారు.

దూదిగాంలో రైతు సదస్సు

బాల్కొండ: మెండోరా మండలం దూదిగాం గ్రామంలో సోమవారం పోచంపాడ్ ఎస్‌బీఐ శాఖ ఆధ్వర్యంలో రైతు సదస్సు నిర్వహించారు. బ్యాంకు చీఫ్ జనరల్ మేనేజర్ రాజేశ్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. బ్యాంకుల ద్వారా రైతులకు అందుతున్న పథకాలను గురించి వివరించారు.

ఆధ్యాత్మికం..

■ శివాలయాల్లో ప్రత్యేక పూజలు



రుద్రూర్: మండల కేంద్రంలోని వీరభద్ర స్వామి ఆలయం, రాజరాజేశ్వర స్వామి ఆలయం, స్వయంభూ బసవేశ్వర స్వామి ఆలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవతామూర్తులకు అభిషేకం, పుష్ప అలంకరణ, అన్నపూజ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బోధన్ పట్టణంలో..



బోధన్‌రూరల్: పట్టణంలోని శ్రీచక్రేశ్వర శివాలయంలో సోమవారం ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. అలాగే భక్తులు స్వామివారిని దర్శించుకొని, పూజలు చేశారు.

ఆర్మూర్ పట్టణంలో..

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నందీశ్వర మహారాజ్ ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకిసేవ కొనసాగింది. భక్తులు తీర్థప్రసాదాలు, అన్నదానం స్వీకరించారు.

■ ఘనంగా పాపనాగమ్మ పండుగ

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలో సోమవారం గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో పాపనాగమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు బోనాలతో ఊరేగింపు నిర్వహించి, ఆలయానికి తీసుకువచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, చెరువులో తెప్పలను వదిలారు.



■ వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

వేల్పూర్: మండలంలోని పడగల్ గ్రామంలో శుక్రవారం దేవి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం అమ్మవారి విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. మంగళవారం ధాన్యదివాసం, యజ్ఞం నిర్వహిస్తామని వేదపండితులు రఘురామాచార్యులు, వీడీసీ సభ్యులు పేర్కొన్నారు. బుధవారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనున్నారు.



■ ఎడపల్లిలో కుంకుమార్చన

ఎడపల్లి: మండల కేంద్రంలో సోమవారం బాసర శ్రీ ఆదిశంకరాచార్య భగవాన్ నామ సంకీర్తన మండలి గంగాధర్ శర్మ పవన్ శర్మ ఆధ్వర్యంలో లలిత సహస్రనామ కుంకుమార్చన నిర్వహించారు. ఈసందర్భంగా సుమారు 100 మంది మహిళలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జెడ్పీ మాజీ వైస్ చైర్‌పర్సన్ రజిత యాదవ్ పాల్గొన్నారు



■ శ్రీవారి కల్యాణోత్సవం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలో బాలాజీ జెండా జాతర నవరాత్రి ఉత్సవాలు సర్వసమాజ్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీలక్ష్మీ సహస్రనామ కుంకుమార్చన, శ్రీ వేంకటేశ్వర స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు బాలాజీ జెండాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పేదల స్థలాలు చూపించండి

వర్ని: చందూర్‌లోని మర్రి బోగడకాలనీలో నిరుపేదలకు పట్టాలిచ్చి స్థలం చూపించకుండా అధికారులు ఏళ్లుగా నిర్లక్ష్యం వహిస్తున్నారని, వెంటనే స్థలాలను చూపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. రమేష్ బాబు మాట్లాడుతూ.. స్థలం చూపెట్టకపోతే ప్రభుత్వ స్థలంలో నిరుపేదలతో గుడిసెలు వేస్తామని హెచ్చరించారు. నాయకులు నన్నేసాబ్, సాయిబాబా, లక్ష్మణ్, సత్యనారాయణ, రాజయ్య పాల్గొన్నారు.



ప్రభుత్వ స్థలాలకు పట్టాలివ్వండి



బోధన్: పట్టణంలోని పాండుఫారం ప్రాంతంలోని ప్రభుత్వ స్థలాల్లో పదేళ్లుగా నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్న తమకు పట్టాలు ఇవ్వాలని కాలనీవాసులు కోరారు. ఈమేరకు వారు సోమవారం సీపీఎం పట్టణ కార్యదర్శి శంకర్‌గౌడ్ అధ్వర్యంలో ఆర్డీవో ఆఫీసులో అధికారికి వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కాలనీలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. కాలనీవాసులు పోశవ్వ, భూదేవి, నాగమణి, శేషాబాయి పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	పాగల్ వీఎస్ కాదల్ (తెలుగు) – 02.15 భవనం 4.35, 10.20 సింబ (తెలుగు) – 7.35
స్క్రీన్-2 –	కమిటీ కుర్రోళ్లు – 12.30, 3.45, 07.00, 10.15
స్క్రీన్-3 –	మురారి (తెలుగు) – 11.05, 6.00, 10.00
స్క్రీన్-4 –	రాయన్ (తెలుగు) 11.40, 6.35, కల్కి 2898 ఏడీ (తెలుగు) – 2.50, 9.45

సమాచారం..

■ నేడు ఆర్మూర్ మున్సిపల్ సర్వసభ్య సమావేశం

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు కమిషనర్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని కౌన్సిలర్లు సకాలంలో హాజరుకావాలని కోరారు.

■ ఉపాధిహామీ ప్రజావేదిక

రుద్రూర్: మండల కేంద్రంలోని సమీకృత భవనంలో మంగళవారం ఉపాధి హామీ మండలస్థాయి ప్రజావేదిక నిర్వహిస్తున్నట్టు మండల అభివృద్ధి అధికారి సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది గంటలకు సభ ప్రారంభమవుతుందన్నారు.

■ నేడు వేల్పూర్ బంద్

వేల్పూర్: బంగ్లాదేశ్‌లో హిందువుల ఊచకోతను నిరసిస్తూ వేల్పూర్‌లో మంగళవారం బంద్ నిర్వహించనున్నట్లు యువజన సంఘాలు ఒక ప్రకటనలో పేర్కొన్నాయి. బంద్‌కు వ్యాపార వర్గాలు, విద్యాసంస్థలు సహకరించి విజయవంతం చేయాలని వారు కోరారు.